నేడు, రేపు బీఆర్ఎస్ సమన్వయ కమిటీ సమావేశాలు

ఎమ్మెల్యే తలసాని

బేగంపేట్ ఏప్రిల్ 4: సనత్‌నగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సమన్వయ కమిటీ సమావేశం ఈ నెల 6న ఉదయం 9.30 గంటలకు వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్ హాజరవుతారని అన్నారు. ఈ సమావేశానికి సనత్‌నగర్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్‌ల అధ్యక్షులు, ముఖ్య నా యకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరుకావాలని సూచించారు.

నేడు బేగంపేట్‌లో...

శుక్రవారం బేగంపేట్‌లోని మయూరిమార్గ్‌లో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నట్లు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి పాల్గొంటారని ఆయన తెలిపారు. పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు.

షాబాద్‌గూడలో జరిగిన ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరుడికి పండు తినిపిస్తున్న బీఆర్ఎస్ పార్టీ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్

కార్ఖానాలోని మసీదు వద్ద ముస్లిం సోదరులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో కంటోన్మెంట్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత గజ్జెల నాగేశ్, తదితరులు

మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందులు

సికింద్రాబాద్,ఏప్రిల్4: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని సికింద్రాబాద్ నియోజవర్గంలో గురువారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్, తదితరులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని షాబాద్‌గూడ కౌన్సిల్ నాన్ మహల్ ప్రాంతంలో మైనారిటీ నాయకుడు మహమ్మద్ లయిక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరయ్యారు.ఈ సందర్భంగా ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ హేమ, యువజన విభాగం రాష్ట్ర నాయకుడు రామేశ్వర్‌గౌడ్, మైనారిటీ నాయకులు కరీం, పాషా ఖాద్రీ , ఖదీర్, గౌస్, జహంగీర్, ముస్లిం సోదరులు, పార్టీ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

కార్ఖానాలో..

కంటోన్మెంట్, ఏప్రిల్ 4 : మత సామరస్యానికి ప్రతీకలుగా ఇఫ్తార్ విందులు నిలుస్తున్నాయని రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, కంటోన్మెంట్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గజ్జెల నాగేశ్ అన్నారు. ఈ మేరకు గురువారం సాయంత్రం మూడవ వార్డు కార్ఖానాలోని మసీదు వద్ద ముస్లిం సోదరులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరయ్యారు. అనంతరం ముస్లిం సోదరులకు పండ్లు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జంగిలి రాజు, రావుల సతీష్, శివయాదవ్, రాహుల్‌తో పాటు పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

రైల్లో గంజాయి తరలింపు.. ఇద్దరు అరెస్టు

మారేడ్‌పల్లి, ఏప్రిల్ 4: రైల్లో గంజాయిని తరలిస్తున్న ఇద్దరు యువకులను సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన మనోజ్ పర్మార్ ఏసీ కోచ్‌లో అటెండర్‌గా పని చేస్తున్నారు. అదే ప్రాంతానికి చెందిన అనిల్ ఉపాధ్యాయ్‌తో కలిసి జల్సాల కోసం గంజాయి సరఫరాను ఎంచుకున్నారు. ఇందు లో భాగంగా ఒడిశా నుంచి మహారాష్ట్రలోని ముంబైకి కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి తరలిస్తున్నారు. తాండూర్ రైల్వే స్టేషన్‌లో వికారాబాద్ ఆర్‌పీఎస్ నేతృత్వంలో సికింద్రాబాద్ రైల్వే పోలీసుల బృందం తనిఖీలు చేయగా.. 14 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిద్దరిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

సహారా పేరుతో ఆర్థిక దోపిడీ చేశారు..

ఖైరతాబాద్, ఏప్రిల్ 4: సహారా పేరుతో ఆర్థిక దోపిడీకి పాల్పడి తమను రోడ్డున పడేశారని బాధితురాలు పూజిత వాపోయారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నర్సింగ్, గణేశ్‌తో కలిసి ఆమె మాట్లాడారు. సహారా ఎలాంటి డిపాజిట్లు స్వీకరించవద్దంటూ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్‌ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా (సెబీ)తో పాటు ఆర్థిక నియంత్రణ సంస్థలు నిషేధం విధించాయని తెలిపారు. అయినా అక్రమంగా అమాయకుల వద్ద డిపాజిట్లు స్వీకరించి వారిని దోచుకుంటున్నారని ఆరోపించారు. నాలుగేండ్లుగా బాధితులమైన తాము చేస్తున్న పోరాటానికి కొంత ఫలితం దక్కిందన్నారు. బుధవారం సహారా సౌత్ జోన్ డైరెక్టర్ రామకోటేశ్వరరావును నగర సీపీ శ్రీనివాస్‌రెడ్డి చొరవతో పోలీసులు అరెస్టు చేయడం పురోగతిని కలిగించిందన్నారు. ఎందరో తల్లిదండ్రులు తమ పిల్లల చదువులు, పెండ్లిల కోసం దాచుకున్న డబ్బులను సహారా దోచుకున్నదన్నారు. ఇప్పటికే ఢిల్లీ కోర్టులో 127మంది బాధితులు కేసులు వేశారని, సహారా పేరుతో ఆర్థిక దోపిడీ చేసిన ప్రతిఒక్కరిపై నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టాలని బాధితురాలు విజ్ఞప్తి చేశారు.

మెస్ట్ చార్జీలను తక్షణమే విడుదల చేయాలి

అడ్డగుట్ట, ఏప్రిల్ 4 : విద్యార్థులకు అకాడమిక్ ఇయర్ ప్రకారం పది నెలలకు సరిపడ మెస్ చార్జీలను విడుదల చేయాలని ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యుడు అలివేలి రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ.. గత మూడు సంవత్సరాలుగా ఉస్మానియా యూనివర్సిటీ పీజీ విద్యార్థులు చాలిచాలని మెస్‌చార్జీలతో ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఓయూ అధికారులు పది నెలలకు సరిపడ మెస్‌చార్జీలు ప్రభుత్వం నుండి వచ్చే విధంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అక్టోబర్‌లో ప్రారంభమైన అకాడమిక్ ఇయర్ నుండి అకాడమిక్ ఇయర్ ముగింపు వరకు మెస్ చార్జీలు చెల్లించాలన్నారు. లేదా ఫైనాన్షియల్ ఇయర్ జూన్ నుండి మార్చి వరకు ఉంటుందని, దాని ప్రకారమైన మెస్ చార్జీలు చెల్లించాలన్నారు. ఈ విషయంపై యూనివర్సిటీ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని అన్నారు.

ఓయూ స్విమ్మింగ్ పూల్‌ను ఓపెన్ చేయాలి

ఫిజికల్ ఎడ్యుకేషనల్ డైరెక్టర్ రాజేశ్ కుమార్‌ను నిలదీస్తున్న ఏబీవీపీ రాజు

ఉస్మానియా యూనివర్శిటీ, ఏప్రిల్ 4 : ఉస్మానియా యూనివర్సిటీలో స్విమ్మింగ్ పూల్‌ను వెంటనే ఓపెన్ చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఫిజికల్ ఎడ్యుకేషనల్ డైరెక్టర్ రాజేశ్ కుమార్‌ను కలిసి నిలదీశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యుడు రాజు మాట్లాడుతూ... మరమ్మతుల పేరుతో స్విమ్మింగ్ పూల్‌ను మూసివేయడం సిగ్గుచేటన్నారు. మరమ్మతు పనుల్లో నిర్లక్ష్యం వహించడం ఏంటని ఆయన ప్రశ్నించారు. ప్రతి సంవత్సరం వేసవికాలంలో విద్యార్థులకు అందుబాటులో ఉండాల్సిన స్విమ్మింగ్ పూల్ మూసివేయడం సరికాదన్నారు. మరమ్మతులు చేసేదుంటే ముందే చేయాలని, ఇప్పటికైనా ఓయూ ఉన్నతాధికారులు స్పందించి స్విమ్మింగ్ పూల్‌ను ఓపెన్‌చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

వక్ఫ్‌బోర్డుకు న్యాయాధికారాలు ఇవ్వండి

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 4: వక్ఫ్‌బోర్డు కు న్యాయాధికారాలు ఇవ్వాలని ఉమ్మడి ఏపీ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎంఏ సిద్ధిక్, ఆలిండియా ముస్లిం మైనార్టీ ఆర్గనైజేషన్ చైర్మన్ సయ్యద్ ముక్తార్ హుస్సేన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడు తూ.. రాష్ట్రంలో వేలకోట్ల వక్ఫ్ భూములు, ఆస్తులు ఆక్రమణకు గురయ్యాయని చెప్పా రు. వక్ఫ్ భూములను రక్షించేందుకు ప్రత్యేకంగా కమిషనరేట్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్‌ను సందర్శించిన అధికారులు

బన్సీలాల్‌పేట్, ఏప్రిల్ 4 : న్యూబోయిగూడ, ఐడీహెచ్ కాలనీలోని షాపింగ్ కాంప్లెక్స్‌ను, బన్సీలాల్‌పేట్‌లోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ను గురువారం బల్దియా అధికారులు సందర్శించారు. ఇటీవల స్థానిక కాంగ్రెస్ నాయకులు జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. దాంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ డిప్యూటీ ఎస్టేట్ అధికారి ఇంద్రసేన్, సిబ్బందితో కలసి సందర్శించారు. షాపింగ్ కాంప్లెక్స్‌లో వ్యాపారాలు చేసుకుంటున్నవారి వివరాలను సేకరించారు. అనంతరం మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌ను పరిశీలించారు. ఆన్‌లైన్‌లో మాత్రమే హాల్ బుకింగ్ చేయాలని అధికారులు సూచించారు. తాగునీటి కోసం ఒక స్వచ్ఛంద సంస్థ వాటర్ ప్లాంట్‌ను నిర్మించిందని, పేదలకు తక్కువ ధరకు వాటర్ క్యాన్‌లను సరఫరా చేయాలని అన్నారు. తాము సేకరించిన వివరాలను నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. స్థానిక డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఐతా చిరంజీవి, నాయకులు ఎంఎం.రాజు, విశాల్ వారివెంట ఉన్నారు.

బోయిన్‌పల్లి బాపూజీనగర్ ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు తినుబండారాలు అందజేసిన తావిష్ జైన్ , జంపన ప్రతాప్

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేయూతనివ్వాలి

కంటోన్మెంట్, ఏప్రిల్ 4 : ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు అండగా ఉండటం అభినందనీయమని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. యువత వృథా ఖర్చులుమాని ప్రభుత్వ పాఠశాల్లో చదువుకునే విద్యార్థులకు సహకరించాలని సూచించారు. సర్కారు బడుల్లోని విద్యార్థుల్లో అధిక శాతం మంది నిరుపేదల కుటుంబాలకు చెందినవారే ఉంటారని, వారికి చేయూతనివ్వాలని అన్నారు. బోయిన్‌పల్లి జైన్ సమాజ్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు తావిష్‌జైన్ పుట్టినరోజు సందర్భంగా బోయిన్‌పల్లి బాపూజీనగర్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తినుబండారాలతోపాటు కేక్‌ను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్ మేడా ఆశీర్వాదం, ఉపాధ్యాయులు శ్రీనివాస్ ప్రేమలత, పద్మావతి, ప్రభుకుమార్ గౌడ్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

అగ్గిపెట్టె ఉందా అంటూ.. సెల్‌ఫోన్ చోరీ

ఖైరతాబాద్, ఏప్రిల్ 4: అగ్గిపెట్టె ఉందా అంటూ ఓ వ్యక్తి సెల్‌ఫోన్‌ను గుర్తుతెలియని దుండగుడు అపహరించుకెళ్లాడు. ఈ ఘటన పంజాగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలోని అమీర్‌పేట కేఎల్ఎం షాపింగ్ మాల్ వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని నాచారం పరిధి గోకుల్‌నగర్‌కు చెందిన సుడిగాల సాయికుమార్ క్యాబ్ డ్రైవర్. గురువారం షాపు వద్ద ఉండగా, గుర్తుతెలియని వ్యక్తి వచ్చి అగ్గిపెట్టె అడిగాడు. తన వద్ద లేదంటూ సమాధానం చెబుతుండగానే చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ను తీసుకొని పరుగులు పెట్టాడు. అనంతరం షాపు ఎదురుగా ఆగి ఉన్న ఆటోలో ఎక్కిపారిపోయాడు. వెంటనే కారు తీసుకొని ఆటోను వెంబడించగా అప్పటికే జారుకున్నారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాజకీయ ఊసరవెల్లి రేవంత్..

- మల్కాజిగిరిలో కాంగ్రెస్‌కు డిపాజిట్ రాదు
- మీడియా సమావేశంలో మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల

కంటోన్మెంట్, ఏప్రిల్ 4 : ఊసరవెల్లి కంటే తొందరగా సీఎం రేవంత్‌రెడ్డి రంగులు మారుస్తున్నారని అధికారంలోకి రాకముందు ఒకమాట, వచ్చాక మరోమాట మాట్లాడుతున్నారని మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ విమర్శించారు. గురువారం కంటోన్మెంట్‌లోని తిరుమలగిరి, కార్ఖానాలలోని జైన్స్, అగర్వాల్స్‌కు సంబంధించిన కమ్యూనిటీల్లో ఈటల పర్యటించారు. అనంతరం తాడ్‌బండ్‌లోని బీజేపీ నేత సదా కేశవరెడ్డి నివాసం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి డబ్బు మీదనే కానీ, ప్రజా సంక్షేమం పట్ల శ్రద్ధ లేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తుందని, ఒక పార్టీలో గెలిచి, మరో పార్టీలోకి మారిపోయి, పదవులు పొందడం అనేది నీచమైన పని అని సీఎం రేవంత్ రెడ్డి గతంలో చెప్పిన విషయం మర్చిపోయారా అని ప్రశ్నించారు. పార్టీలు మారిన వారిని పిచ్చికుక్కలను కొట్టినట్టు కొట్టమని చెప్పింది మరిచావా అంటూ చురకలంటించారు. పార్టీ మారిన దానం నాగేందర్‌కు ఎలా టిక్కెట్ ఇచ్చా రో రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పొన్నాల లక్ష్మయ్య పార్టీ మారినప్పుడు చచ్చే వయసులో ఇదేం పని అన్నావు కదా, మరి కేకే పట్ల మీరు చేసింది ఏంటని మండిపడ్డారు. 11 శాతం ఉన్న

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

మాదిగలకు ఒక్క సీటు ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందన్నారు. సమావేశంలో వరంగల్ బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేశ్, నేతలు ప్రదీప్‌రావు, సుష్మిత, బోర్డు మాజీ ఉపాధ్యక్షురాలు భానుకా నర్మద, మల్లికార్జున్, వంశీ తిలక్, వినోద, అనురాధ, ఆశోక్, పాండు, మణికంఠ, నాగరాజ్ పాల్గొన్నారు.

కంటోన్మెంట్ అభివృద్ధికి కృషి

బొల్లారం,ఏప్రిల్ 4: కంటోన్మెంట్ ఏడో వార్డు లాల్ బజార్‌లో అగర్వాల్ సమాజ్, జైన్, ఆర్యవైశ్య సంఘ సభ్యులతో గురువారం మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో విజయ్ అగర్వాల్, దీపక్ అగర్వాల్, వినోద్ అగర్వాల్, విశాల్ అగర్వాల్, రాకేశ్ అగర్వాల్, గోవింద్ అగర్వాల్, రామ్ కుమార్, చంద్ర శేఖర్ యాదవ్, పిట్ల నాగేశ్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలి

బన్సీలాల్‌పేట్, ఏప్రిల్ 4 : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విజయం కోసం బూత్ కమిటీ సభ్యులు కృషి చేయాలని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ వావిరాల చంద్రశేఖర్ అన్నారు. భోలక్‌పూర్‌లో బన్సీలాల్‌పేట్ డివిజన్ బూత్ ఇన్‌చార్జీలు, బూత్ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రి సి.కృష్ణ యాదవ్, టి.రాజశేఖర్ రెడ్డి, గుండు కృష్ణ, హరినాథ్ నాయి, డివిజన్ అధ్యక్షుడు ఉమేశ్ ఖండేల్వాల్‌లు మాట్లాడారు. కేంద్రం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించాలని వారు సూచించారు.

విద్యుదాఘాతంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

వెంగళరావునగర్, ఏప్రిల్ 4: విద్యుదాఘాతంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై శ్రవణ్‌కుమార్ వివరాల ప్రకారం.. బల్కంపేటలోని ఎస్‌బీఐ బ్యాంకు ముందున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు గుర్తు తెలియని వ్యక్తి తగిలి పడి ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు వచ్చి అతడిని 108 ద్వారా గాంధీ దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే వ్యక్తి మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సదరం క్యాంపు దరఖాస్తుల ఆహ్వానం

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 4: సదరం క్యాంపు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో మున్ని గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాలోని దివ్యంగులు సదరం క్యాంపు కోసం దరఖాస్తులు చేసుకోవడానికి ఈనెల 8న ఉదయం 11 గంటలకు ఆన్‌లైన్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని పేర్కొన్నారు. మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు సూచించిన దవాఖానకు వెళ్లి ఇక్కడి నుంచి డాక్టర్ సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. జిల్లాలోని దివ్యాంగులు కొండాపూర్, వనస్థలిపురంలోని దవాఖానల్లో క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఆధార్, రేషన్ కార్డులను తీసుకురావాలన్నారు.

పాత మెడికల్ రికార్డ్స్‌ను తొలగిస్తాం

ఖైరతాబాద్, ఏప్రిల్ 4: నిమ్స్ దవాఖానలో ఉన్న పాత మెడికల్ రికార్డులను తొలగిస్తున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. నిమ్స్‌కు వచ్చే రోగుల మెడికల్ రికార్డ్స్‌ను ఎప్పటికప్పుడూ భద్రపరుస్తామని, అయితే కొన్నేళ్లుగా వేలాది రికార్డులు పేరుకు పోయాయని తెలిపారు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం ప్రతి పదేండ్ల కోసారి పాత రికార్డులను నిర్వీర్యం చేస్తారన్నారు. అదే నేపథ్యంలో 2011 జనవరి 1వరకు ఉన్న రికార్డులను పూర్తిగా తొలగించేందుకు వైద్యుల కమిటీ నిర్ణ యం తీసుకుందని వెల్లడించారు. ఈ కాల వ్యవధిలో ఎవరైనా రోగులు ఆస్పత్రిలో చికిత్స పొందిన రోగుల ఎంఎల్ సీ రికార్డులు, ఇతర కేస్‌షీట్లు కావాలనుకుంటే మెడికల్ సూపరింటెండెంట్ లేదా ఎంఆర్‌డీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ట్రాఫిక్‌కు అడ్డంకులు.. వ్యాపారులపై కేసులు

బంజారాహిల్స్, ఏప్రిల్ 4: రోడ్డుపై వాహనాల రాకపోకలకు అడ్డంకులు కల్పిస్తూ వ్యాపారాలు ఏర్పాటు చేసిన ఇద్దరు వ్యక్తులపై ఫిలింనగర్ పోలీసులు కేసులు నమోదు చేశారు. షేక్‌పే ట ప్రధాన రహదారిలోని డీమార్ట్ సమీపంలో రంజాన్ సందర్భంగా సయ్యద్ అదిల్ అనే వ్యక్తి 'నూర్ ఏ రంజాన్ ఎక్స్‌పో' పేరుతో షాపు ఏర్పాటు చేశాడు. పార్కింగ్ సౌకర్యం లేక వాహనదారులు తమ వాహనాలను ఫుట్‌పాత్‌తో పాటు వాక్ వే మీద పార్క్ చేస్తున్నారు. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని టోలీచౌకి ట్రాఫిక్ ఎస్సై ప్రేమ్‌రాజ్ ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఐపీసీ 283, 341, 336 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరో ఘటనలో టోలీచౌకిలోని ఎంఎఫ్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో ముర్తుజా 'రౌనక్-ఏ-రంజాన్' పేరుతో షాపింగ్ ఎక్స్‌పో ఏ ర్పాటు చేశారు. పార్కింగ్ సౌకర్యం సరిపోయినంత లేకపోవడంతో కస్టమర్లు రోడ్లపై, ఫుట్‌పాత్‌లపై పార్కింగ్ చేస్తున్నారు. ఈ మేరకు ట్రా ఫిక్ ఎస్సై ఫిర్యాదుతో నిర్వాహకుడు మూర్తుజా మీద కేసు నమోదు చేశారు.

సాంస్కృతిక పోటీల్లో భాగంగా ఆడిపాడుతున్న విద్యార్థులు

చేతులు లేకున్నా పెయింటింగ్ వేస్తున్న విద్యార్థిని

ముగిసిన ఓయూ అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీలు

ఉస్మానియా యూనివర్సిటీ అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీలు గురువారంతో ముగిశాయి. రెండు రోజులుగా ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో ఓయూ పరిధిలోని వివిధ యూజీ, పీజీ, ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొని తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థుల పేర్లను అధికారులు త్వరలోనే ప్రకటించనున్నారు. – ఉస్మానియా యూనివర్సిటీ

మాతృభాషను మర్చిపోవద్దు..

బంజారాహిల్స్, ఏప్రిల్ 4: భారతీయ సంస్కృతికి, జీవన విధానాన్ని, తాత్విక చింతనను ప్రపంచం మొత్తం ప్రత్యేకంగా గుర్తిస్తుంటే మనం మాత్రం పాశ్చాత్య ప్రభావానికి లోను కావడం ఆవేదన కలిగిస్తుందని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నం.4లోని కళాకృతి ఆర్ట్ గ్యాలరీలో ప్రముఖ కళాకారుడు ఆర్.గిరిధర్‌గౌడ్ వేసిన మినియేచర్ పెయింటింగ్స్‌తో ఏర్పాటు చేసిన శివ అండ్ శక్తి ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను గురువారం వెంకయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంగీతం, సాహిత్యం, చిత్రలేఖనం, నాట్యకళలు భారతీయ సంస్కృతిలో భాగమని అన్నారు. ఒకప్పుడు భారతదేశం ప్రపంచానికే విశ్వగురువుగా ఉండేదన్నారు. అయితే పాశ్చాత్య పోకడలు పెరిగిపోవడంతో భాషతో పాటు వేషధారణలో మార్పులు వచ్చాయన్నారు. ప్రపంచంలో ఎక్కడ మంచి ఉన్నా స్వీకరించడం తప్పులేదని, అదే క్రమంలో మన మాతృభాషను మర్చిపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో సినీరచయిత తనికెళ్ల భరిణి, అంతర్జాతీయ క్రికెట్ అంపైర్ అనిల్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పక్షవాతానికి చికిత్స పేరిట మోసం

వెంగళరావునగర్, ఏప్రిల్ 4: పక్షవాతానికి ఉచిత చికిత్స చేస్తామని, మందులకే డబ్బులివ్వాలని నమ్మించి మోసగించారు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకా రం.. మధురానగర్‌లో ఉండే మహ్మద్ మెహబూబ్‌అలీ గతేడాది మార్చి 16న టీస్టాల్ వద్దకు రాగా.. జావీద్, శ్రీనాథ్ అనే ఇద్దరు వ్యక్తులు కూడా వచ్చారు. అయితే.. పక్షవాతం చికిత్సకు పైసా కూడా తీసుకోకుండా ఉచితంగా వైద్యం అందిస్తామంటూ వారిద్దరు నమ్మించారు. తన తల్లికి పక్షవాతం ఉన్నదని, ట్రీట్‌మెంట్ చేయాలని అలీ వారిని కోరాడు. రెండు నెలల్లో నయం చేస్తామని చెప్పి.. మందుల కోసమంటూ రూ.22వేలు తీసుకున్నారు. చింతల్‌లోని శ్రీనాథ్ ఆయుర్వేదిక్ భండార్‌కు వెళ్లి మందులు తీసుకోవాలని సూచించగా.. అదేరోజు అక్కడికి వెళ్లి మందులు తీసుకుని వాడారు. నెలలు గడుస్తున్నా ఫలితం లేకపోడంతో జావిద్‌కు ఫోన్ చేయగా.. మరోసారి మందులు కొనుక్కోవాలని చెప్పాడు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన అలీ.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఎంపీగా రేవంత్‌రెడ్డి.. మల్కాజిగిరికి చేసిందేమీలేదు

బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 4 : మల్కాజిగిరి ఎంపీగా గెలిచిన రేవంత్‌రెడ్డి ఇక్కడి ప్రజలకు చేసిందేమీలేదని.. కనీసం ఎంపీ నిధులను కూడా తీసుకుని అభివృద్ధి చేసింది లేదని మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం కూకట్‌పల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్‌వన్‌గా అభివృద్ధి చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దని.. పేదలందరికీ సంక్షేమ పథకాలు... కాలనీ, బస్తీలకు అభివృద్ధి ఫలాలు చేరాయన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ హైదరాబాద్ నగర